క్లుప్తంగా

శాకంబరి అలంకరణలో రాట్నాలమ్మ



శాకంబరి అలంకరణలో దర్శనమిస్తున్న రాట్నాలమ్మ అమ్మవారు

పెదవేగి: ప్రసిద్ధి గాంచిన శ్రీరాట్నాలమ్మ అమ్మవారు ఆషాఢ మాస సందర్భంగా శాకంబరి అలంకరణలో దర్శనమిచ్చారు. పెదవేగి మండలం రాట్నాలకుంట గ్రామంలో వెలసిన శ్రీరాట్నాలమ్మను గురువారం దేవస్థానంలో పలు రకాల పళ్లు, కూరగాయలతో ప్రత్యేకంగా అలంకరించి, విశేష పూజలు నిర్వహించారు.

విద్యార్థుల భోజనం పరిశీలన



విద్యార్థులకు భోజనాలు వడ్డిస్తున్న ఫుడ్ కమిటీ కమిషనర్ విజయ ప్రతాప్‌రెడ్డి

ఉంగుటూరు: స్థానిక జెడ్పీ హైస్కూలులో విద్యార్థుల భోజనాలను ఫుడ్ కమిటీ కమిషనర్ విజయప్రతాప్‌రెడ్డి, అధికారులు గురువారం పరిశీలించారు. వారందరితో కలిసి భోజనాలు చేశారు. మెగా పేరెంట్స్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సర్పంచి బండారు సింధు, డీవై ఈవో రవీంద్ర భారతి, ఉపసర్పంచి జగదీస్, నారాయణం హనుమంతురావు పాల్గొన్నారు.

సాయిబాబాకు ప్రత్యేక పూజలు



అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

గణపవరం: గురుపౌర్ణమి సందర్భంగా గురువారం సాయిబాబా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా ఆలయాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. గురువారం తెల్లవారుజాము నుంచి భక్తులు సాయిబాబాను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. షిర్డీ సాయి మందిరంలో భక్తులు, ఆలయ నిర్వహణ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో బాబాకు పాలాభిషేకం నిర్వహించారు. పిప్పర, సరిపల్లె, అర్ధవరం, తదితర గ్రామాల్లోని సాయిబాబా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

అన్నదాత సుఖీభవ అర్హుల జాబితా ప్రదర్శన



అర్హుల జాబితాను ప్రదర్శిస్తున్న ఏవో ప్రసాద్

గణపవరం: మండలంలో అన్నదాత సుఖీభవ పథకానికి 4814 మంది రైతుల తుది అర్హుల జాబితాను గ్రామ సచివాలయాల వద్ద ప్రదర్శిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి ఆర్ఎస్ ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా అర్ధవరం సచివాలయం వద్ద అర్హుల జాబితాను ప్రదర్శించారు. రైతులతో మాట్లాడుతూ అర్హత కలిగి జాబితాలో పేరు లేకపోతే రైతులు వెంటనే రైతుసేవా కేంద్రంలో సంప్రదించాలని సూచించారు. కౌలు రైతులు సీసీఆర్‌సీ కార్డులను తీసుకోవాలని సూచించారు.

సారా విక్రయిస్తే కఠిన చర్యలు

చింతలపూడి : స్థానిక ప్రోహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్‌ను గురువారం ప్రోహిబిషన్ ఎక్సైజ్ ఏలూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ కేఎన్ ప్రభు కుమార్ ఆకస్మిక తనిఖీ చేశారు. స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. నవోదయం 2.0 విజయవంతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన కోరారు. సారా తయారు చేసినా విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నాగిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన ఇస్లావతు రాముపై పీడీ యాక్ట్ నమోదుకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు.

విజయరాజును కలిసిన నాయకులు

జంగారెడ్డిగూడెం: కూటమి ప్రభుత్వం అనుసరిస్తోన్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని వైఎస్సార్ సీపీ చింతలపూడి నియోజకవర్గం ఇన్‌చార్జి కంభం విజయరాజు అన్నారు. గురువారం విజయరాజును జంగారెడ్డిగూడెంలోని జెట్టి గురునాథరావు నివాసం వద్ద పార్టీ శ్రీనివాసపురం నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. వీరిలో శ్రీనివాసపురం సీనియర్ నాయకులు పొల్నాటి ప్రభాకర్, పొల్నాటి శ్రీనివాసరావు, సిర్రా రాజేష్, వసంతాటి అశోక్, సీతారాములు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణం సరే.. నిర్వహణ ఏది?

- అస్తవ్యస్తంగా అండర్ పాస్‌ల నిర్వహణ
- నీరు నిలిచి కాలువలను తలపిస్తున్న వైనం
- వాహనదారుల పాలిట శాపంగా అండర్ పాస్



అండర్‌పాస్‌లో మురికి నీటిలో నడుస్తున్న పాదచారులు

దెందులూరు: దెందులూరు-అలుగులగూడెం గ్రామాల మధ్య రైల్వే ట్రాక్ వద్ద కోట్లాది రూపాయలు వెచ్చించి అండర్ పాస్ నిర్మాణం చేశారు. కాని నిర్వహణను గాలికొదిలేశారు. దీంతో అండర్ పాస్‌లలో నీరు నిలిచిపోయి, రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. దీంతో కోట్లాది రూపాయల నిధులు నీటి పాలు చేశారని పలువురు విమర్శిస్తున్నారు. అండర్‌పాస్ మీదుగా పెదవేగి, ఏలూరు, భీమడోలు, దెందులూరు మండలాల వేలాదిమంది రైతులు, విద్యార్థులు, వ్యాపారులు, ఉద్యోగులు, పాదచారులు ప్రయాణం చేస్తారు. రైల్వే గేటు పడితే అరగంట వేచి ఉండాల్సి వస్తుంది. దీంతో కేంద్ర ప్రభుత్వం అండర్‌పాస్ నిర్మాణం చేస్తే ఇబ్బందులు పోతాయని భావించిన వేలాదిమంది ప్రజలకు అండర్‌పాస్ శాపంగా మారింది. అండర్‌పాస్‌లో సెంటర్‌లో మాత్రమే నాలుగు ట్యూబ్ లైట్లు ఏర్పాటు చేశారు. దెందులూరు వైపు అలుగులగూడెం వైపు కటిక చీకటిగా ఉంది. రెండు వైపులా లైట్లు ఏర్పాటు చేయలేదు. 100 శాతం నిర్మాణం చేసిన నాటి నుంచి నేటి వరకు నీరు నిలిచి ఉంటూనే ఉంది. ప్రతి రోజూ విద్యార్థులు, రైతులు, పాదచారులు ఈ నీటిలోనే నడిచి వెళ్లాల్సి వస్తోందని కన్నీటి పర్యంతం అవుతున్నారు. ఉన్నతాధికారులు పూర్తి స్థాయి పర్యవేక్షణ చేయకపోవడం బాధాకరం అంటున్నారు. వేలాది మంది ప్రజలు ప్రతి రోజూ ఇబ్బందులు పడుతున్న కోట్లు వెచ్చించి నిర్మాణం చేసిన అండర్‌పాస్ ఉపయోగపడకపోయినా ప్రజా ప్రతినిధులు ఉన్నతాధికారులు సమస్య పరిష్కారానికి ఏం చర్యలు తీసుకున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

శాశ్వత పరిష్కారం చూపాలి

వచ్చే జిల్లా పరిషత్ సమావేశంలో సమస్యను నిలదీస్తాం రైల్వే శాఖ ఉన్నతాధికారులు శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి. వేలాది మంది ప్రయాణికుల ప్రయాణవసరాలు అలుసుగా తీసుకుంటే సహించేది లేదు. ఈ సమస్యపై రైల్వే శాఖ తక్షణం స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

–నిట్టా లీలా నవకాంతం, జెడ్పీటీసీ, దెందులూరు

కోట్లు వెచ్చించినా ప్రయోజనం శూన్యం



అండర్ పాస్ నిర్మాణానికి కోట్ల రూపాయలు వెచ్చించారు. కానీ నిర్మాణానికి కోట్లు వెచ్చించి నాలుగు ట్యూబ్ లైట్లు ఏర్పాటు చేయలేకపోయారు. నీళ్లను తొలగించే చర్యలు, వాటి నిర్వహణ ఎందుకు చేయడం లేదు. ప్రతి రోజూ వందలాది మంది ఆ మురికి నీటిలోనే నడిచి వెళుతున్నారు. అయినా అధికారుల నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించడం బాధాకరం.

–బల్ల విజయ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు, దెందులూరు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెదపాడు: మండలంలోని పెదపాడు సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ వై.రాంబాబు చెప్పారు. పెదపాడు, నాయుడు గూడెం, పాతపెదపాడు గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని చెప్పారు.

గణపవరంలో..

గణపవరం: మండలంలోని పిప్పరలో విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా సబ్‌స్టేషన్ పరిధిలోని మొయ్యేరు, ముప్పర్తిపాడు, డి.కుముదవల్లి, కోమర్రు, జల్లికాకినాడ, ఎ.గోపవరం, అపనపేట, కేశవరం, కోమట్లపాలెం, తాళ్లపాలెం, వెంకట్రాజపురం గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ నరసింహమూర్తి తెలిపారు.

ఉంగుటూరులో..

ఉంగుటూరు: ఈ నెల 11వ తేదీ శుక్రవారం బాదంపూడి సబ్‌స్టేషన్, బొమ్మిడి డొమెస్టిక్ ఫీడర్‌పై మరమ్మతుల నేపథ్యంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఈఈ కేఎం అంబేడ్కర్ తెలిపారు. అలాగే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల నిమిత్తం గొల్లగూడెం పరిధిలో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు, ఎ.గోకవరం సబ్‌స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

రేపు విజయరాయిలో..

పెదవేగి: మండలంలోని విజయరాయి సెక్షన్ జానంపేట సబ్‌స్టేషన్‌లో బ్రేకర్ ఎరక్షన్ కారణంగా జానంపేట, జగన్నాథపురం, బి.సింగవరం, ముత్తనవేడు గ్రామాలకు ఈ నెల 12వ తేదీ శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని విద్యుత్ ఈఈ కేఎం అంబేడ్కర్ ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కెమెరా సృష్టికర్త డాగూరే సేవలు చిరస్మరణీయం



డాగూరే విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ ప్రతినిధులు

భీమడోలు: ఫొటోగ్రాఫర్ల జీవితాల్లో వెలుగులు నింపిన కెమెరా సృష్టికర్త డాగూరే సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు కొనియాడారు. భీమడోలు సర్కిల్ ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో భీమడోలు సంత మార్కెట్ వద్ద గురువారం డాగూరే వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. డాగూరే, అబ్దుల్ కలాం విగ్రహాలకు వారు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రతినిధులు డి.డేవిడ్, పుల్లాబోట్ల రామ్మూర్తి, ఏవీ నాగరాజు, చిన్ని, రాజేష్ ఫొటోగ్రాఫర్లు పాల్గొన్నారు.

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు



పెదపాడు: షిర్డీ సాయి ధ్యాన మందిరంలో పారాయణ చేస్తున్న భజన మండలి సభ్యులు



ఉంగుటూరు: కైకరంలో జటావల్లభుల జగన్నాథాన్ని సత్కరిస్తున్న సత్సంగ సభ్యులు

పెదపాడు: మండలంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పెదపాడులోని షిర్డీ సాయి, పర్తిసాయి ధ్యాన మందిరంలోనూ, కలపర్రు సాయి మందిరంలోనూ, గండి చెరువుగట్టు సాయి మందిరంలోనూ గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు.

కైకరం షిర్డీ ఆలయంలో..

ఉంగుటూరు: వ్యాస మహర్షి అందించిన విజ్ఞానం అపారమైందని ప్రముఖ అధ్యాత్మిక ప్రవచన కర్త జటావల్లభుల జగన్నాథం పేర్కొన్నారు. గురువారం కైకరం షిర్డీ సాయి ఆలయంలో పెదిరెడ్డి వేణుగోపాలకృష్ణ, ప్రసాదరావు, శేషవేణి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో గురుపౌర్ణమి ఆరాధనలు నిర్వహించారు. ఈ సందర్భంగా సత్సంగ సభ్యులు, మహిళలు జటావల్లభుల జగన్నాథాన్ని సత్కరించారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ ముత్తంగి వేణుగోపాల్, కొచ్చర్లకోట శ్రీనివాస్, కూన అప్పారావు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

సనాతన ధర్మ పరిరక్షకుడు కైతేపల్లి

గణపవరం: సనాతన హిందూ ధర్మ పరిరక్షణకు కృషి చేస్తున్న శతాధిక ప్రతిష్ఠాచార్య, ప్రభుత్వ దేవాదాయ, ధర్మాదాయ వైదిక స్మార్త ఆగమ మాజీ సలహాదారు బ్రహ్మశ్రీ కై తేపల్లి సుబ్రహ్మణ్యంను గురుపూర్ణిమ సందర్భంగా గురువారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అఖిల భారత హేండ్‌లూమ్స్ డైరెక్టర్ నంద్యాల రామలింగరాజు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, గణపవరం మాజీ సర్పంచ్ కూనిరెడ్డి సోమేశ్వరరావు, సరిపల్లె సర్పంచ్ చనుమూరి దుర్గాభవాని, తితిదే వేద పండితులు అగ్నిహోత్రం పవన్, భద్రాద్రి రామం తదితరులు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశానికి అధికారులు డుమ్మా



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

పెదపాడు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి మండల స్థాయి అధికారులు కొంతమంది గైర్హాజరు కావడంతో ఎంపీడీవోపై ఉమ్మడి జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ మండిపడ్డారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఒకరిద్దరు మండల స్థాయి అధికారులు మినహా మిగతా వారంతా సమావేశ మందిరంలో లేకపోవడంతో ఎంపీడీవోను ప్రశ్నించారు. వారు చెప్పాల్సిన సమాధానాలు మీరు చెబుతారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని వివరించారు. సమావేశానికి రానివారికి, సమావేశానికి వచ్చినట్లు రికార్డుల్లో సంతకాలు చేసిన వారికి నోటీసు ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం ఎంపీపీ బత్తుల రత్నకుమారి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశంలో మండల ఉపాధ్యక్షుడు రెడ్డి స్వర్ణకుమారి, అప్పన పద్మావతి, పాతముప్పర్రు గ్రామ సర్పంచ్ మెడబలిమి స్వరూపరాణి సంతోష్‌కుమార్ వివిధ గ్రామాల సర్పంచ్‌లు ఎంపీటీసీలు ఈఓఆర్డీ సూర్యకుమార్, డాక్టరు పాల్, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

గోవుల సంరక్షణకు 'తపన' ఆర్థిక సాయం



ప్రమాదంలో మృతి చెందిన గోవులను పరిశీలిస్తున్న తపన సంస్థ చైర్మన్

దెందులూరు: గోవుల సంరక్షణకు స్వచ్ఛంద సేవా సంస్థ తపన ఆర్థిక సాయం అందించారని సంస్థ చైర్మన్ గారపాటి సీతారామాంజనేయ చౌదరి అన్నారు. గురువారం ఆశ్రం వైద్యశాల మీదుగా వ్యాసగాని బ్రిడ్జి వద్ద జరిగిన ప్రమాదంలో మృతి చెందిన, గాయపడిన గోవులను ఆయన పరిశీలించారు. వీహెచ్‌పీ ప్రతినిధి శేఖర్ గోవులకు పూర్తి స్థాయిలో గోశాల లేదని తపన చౌదరి దృష్టికి తీసుకెళ్లారు. 10 ఎకరాల స్థలం గోశాల నిర్వహణకు తీసుకుంటే దానికయ్యే పూర్తి ఖర్చు తపన సంస్థ భరిస్తుందన్నారు. ప్రభుత్వం జాతీయ రహదారిపై చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని ఆవుల రవాణాను శాశ్వతంగా నిరోధించేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. దెందులూరు ఎస్సై శివాజీ, పెదవేగి సీఐ రాజశేఖర్ మాట్లాడుతూ ఈ సంఘటనలో బాధ్యులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం



పోస్టర్ విడుదల చేస్తున్న సైబర్ సెల్ సీఐ దాసు, ఎస్సై వల్లీపద్మ

ఏలూరు టౌన్: సైబర్‌నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఏలూరు సైబర్ సెల్ సీఐ ఎం దాసు, ఎస్సై వల్లీపద్మ అన్నారు. ఏలూరు అమీనాపేట సురేష్‌చంద్ర బహుగుణ పోలీస్ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో విద్యార్థులు, తల్లిదండ్రులకు సైబర్‌నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సైబర్‌నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పిస్తూ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా సైబర్ సెల్ పోలీస్ అధికారులు మాట్లాడుతూ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావటంతో సైబర్‌నేరాలు పెరిగాయని, వాటిని సమర్థవంతంగా ఎదుర్కోవాలంటే ప్రజలు సైబర్‌నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, సోషల్ మీడియాతో ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఫిషింగ్, లింక్ స్కామ్స్, ఫేక్‌కాల్స్ వంటివాటిని గుర్తిస్తూ వాటి బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఇటీవల ఆన్‌లైన్ మోసాలకు గురయ్యేవారు ఎక్కువ అయ్యారని, సైబర్‌నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరైనా సైబర్ నేరగాళ్ల బారిన పడి డబ్బు పోగొట్టుకున్నా, వేధింపులకు గురైనా వెంటనే 1930కు సమాచారం ఇస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని సైబర్‌సెల్ సీఐ దాసు తెలిపారు.

విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి



సమావేశంలో పాల్గొన్న జిల్లా ఎస్పీ ప్రతాప శివకిషోర్

దెందులూరు: పిల్లలకు ఉజ్వల భవిష్యత్ కల్పించడంలో ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల భాగస్వామ్యం కీలకమని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి పేర్కొన్నారు. దెందులూరులోని ప్రాథమిక, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన మెగా పేరెంట్స్ టీచర్స్ ఆత్మీయ సమావేశంలో జిల్లా కలెక్టర్ కె.వెట్రిల్వి పాల్గొన్నారు. విద్యా కమిటీ చైర్మన్లు వి.సుబ్బలక్ష్మి, ఇనుముల ఈశ్వర్, ఏలూరు ఆర్‌డీఓ అచ్యుత్ అంబరీష్, డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ, ప్రధానోపాధ్యాయులు పాకలపాటి శ్రీదేవి, పి.శారదాంబ, ఎంఈవో ఏపీఎస్‌వీ ప్రసాద్, డీటీ ఎ.శ్రీనివాసరావు, డీసీపీఓ సూర్య చక్రవేణి, సీడీపీఓ విజయలక్ష్మి పాల్గొన్నారు.

బాలసదనంలో..

దెందులూరు ప్రభుత్వ బాలసదనాన్ని జిల్లా కలెక్టర్ 8 మంది బాలలను దత్తత తీసుకున్నారని గతేడాది ప్రకటించారు. ప్రతి క్లాస్‌కి వెళ్లి వారి క్లాస్ టీచర్స్ తో ఈ పిల్లలకు తనే గార్డియన్‌గా ఉన్నారన్నారు. తల్లికి పాదాభివందనం అంటూ బాలసదనం పిల్లలందరూ కలెక్టర్ కాళ్లకు దండం పెట్టి ఆశీర్వాదం తీసుకున్నారు.

విద్యార్థులను కలలను సాకారం చేసుకోవాలి

ప్రతి విద్యార్థి ఉన్నతమైన కలలు కనాలని వాటిని సాకారం చేసుకోవడానికి నిరంతర కృషి చేయాలని జిల్లా ఎస్పీ కే. ప్రతాప శివ కిషోర్ అన్నారు. గురువారం కొవ్వలి ఉన్నత పాఠశాలలో పేరెంట్స్ టీచర్స్ సమావేశానికి ఎస్పీ, పాఠశాల పూర్వ విద్యార్థి తపన పౌండేషన్ చైర్మన్ గారపాటి సీతారామాంజనేయ చౌదరి పాల్గొన్నారు. దెందులూరు మండల స్పెషల్ ఆఫీసర్ ఎ.సత్యనారాయణ, ఎంఈఓ కె.అన్నమ్మ, ఎస్ఎంసీ చైర్మన్ బీద గణేష్‌కుమార్, న్యాయవాది వెదుళ్ల రాంబాబు, కసుకుర్తి రామకృష్ణ, శుభాకరరావు, సీఐ రాజశేఖర్ పాల్గొన్నారు.

ఆర్థికాభివృద్ధిలో యువత కీలకం

పెదపాడు: ఆర్థిక శక్తిగా ఎదుగుతున్న భారతదేశానికి యువత కీలకమని జేసీ పి.ధాత్రిరెడ్డి అన్నారు. మండలంలోని తాళ్లగూడెంలో మెగా పేరెంట్స్ మీట్ సమావేశానికి జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి సబ్బితి నర్సింహమూర్తి, తహసీల్దార్ ఏ కృష్ణ జ్యోతి, ఎంపీడీవో అమీలుజమా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు తోడ్పాటును అందించాలి

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉపాధ్యాయులు తోడ్పాటునందిస్తే ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా రాణిస్తారని జెడ్పీ చైర్‌పర్సన్ జి.పద్మశ్రీ తెలిపారు. మండలంలోని కలపర్రు, వట్లూరు జెడ్పీ హైస్కూళ్లలో గురువారం జరిగిన మెగా పేరెంట్స్ సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో కలపర్రు సర్పంచ్ వట్రపు విష్ణు తులసి కోటిరెడ్డి, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధిపై దృష్టి సారించాలి

పాఠశాల అభివృద్ధికి విద్యార్థుల తల్లిదండ్రులు కృషి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి కె.అనూరాధ తెలిపారు. మెగా పేరెంట్స్ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షుడు బొప్పిడి కాశీబాబు, ఏలూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి గుత్తా అనీల్, ప్రధానోపాధ్యాయుడు వై.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల భాగస్వామ్యంతో పాఠశాలలు బలోపేతం

భీమడోలు: మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం పురస్కరించుకొని గురువారం మండల వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాలను నిర్వహించారు. కార్యక్రమాల్లో గుండుగొలను నంబర్-1 ప్రైమరీ పాఠశాల హెచ్‌ఎం పాశం పాండురంగారావు, మండల ప్రత్యేకాధికారిణి ఆర్‌వీ నాగరాణి, తహసీల్దార్ బి.రమాదేవి, ఎంఈవో-1, 2 ఈదుపల్లి శ్రీనివాసరావు, అయినపర్తి భాస్కర్‌కుమార్, మాజీ ఎఎంసీ చైర్మన్ వగ్వాల భాస్కర్, పోలసానిపల్లి సర్పంచ్ రహీమాబేగం, హెచ్ఎం కె.తులసి తదితరులు మాట్లాడారు. కార్యక్రమాల్లో ఏఎంసీ చైర్మన్ శేషపుగిరి, నీటి సంఘం అధ్యక్షుడు కుక్కల ప్రసాద్, పాకిన సత్యనారాయణ, మద్దు శ్రీను, ఎస్ఎంసీ చైర్మన్లు కోట దుర్గ, తియ్యాల స్వాతి, ఉప చైర్మన్ సీతయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో మెగా పేరెంట్ టీచర్స్ సమావేశాలు

గణపవరం: మండలంలో గురువారం మెగా పేరెంట్ టీచర్స్ సమావేశాలను ఉపాధ్యాయులు అట్టహాసంగా నిర్వహించారు.

విద్యార్థి ఉన్నత భవితకు బాటలు వేయాలి

పెదవేగి: విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసి వారి ఉన్నత భవితకు బంగారు బాటలు వేయాలని సెయింట్ లూసీ పాఠశాల ప్రిన్సిపల్ సిస్టర్ బీనా జోసెఫ్ అన్నారు. జానంపేటలోని సెయింట్ లూసీ పాఠశాలలో తల్లిదండ్రులు ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సిస్టర్ బిందు జోసెఫ్, ఫాదర్ ఆనంద్, నార్ని జయరాజు, చిట్టిబొమ్మ వెంకటేశ్వరరావు, తల్లిదండ్రులు ,విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో లోపాలను గుర్తించాలి

ఉంగుటూరు: ఆత్మీయ సమావేశాల ద్వారా విద్యార్థుల్లో లోపాలను గుర్తించి మంచి మార్గంలో నడిపించాలని పలువురు వక్తలు అన్నారు. గురువారం మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాలు ప్రభుత్వ విద్యా సంస్థలో నిర్వహించారు. నారాయణపురం ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ బి.శ్రీనివాసరావు, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ రెడ్డియ్య, పూర్వ విద్యార్థి సంఘం నాయకులు ఈపూరి సత్యనారాయణ, బొమ్మిడి అప్పారావు పాల్గొన్నారు.

రాజాశ్రమంలో ఘనంగా గురుపూజోత్సవం



గురుపూజోత్సవంలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి

పెదవేగి: అజ్ఞానాంధకారాన్ని తొలగించి, జ్ఞానమనే వెలుగును చూపిస్తూ మార్గదర్శనం చేసే గురువులను దైవ సమానులుగా భావించాలని మన సంస్కృతి తెలుపుతోందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి అన్నారు. గురుపూర్ణిమ సందర్భంగా పెదవేగి మండలం ముండూరులోని యజ్ఞవల్క్య రాజాశ్రమాన్ని గురువారం గారపాటి చౌదరి బీజేపీ నాయకులతో కలిసి సందర్శించారు. రాజాశ్రమాధిపతులు అభినవ వివేకానంద పూజ్యశ్రీ కృష్ణచరణానంద భారతీ స్వామి, తదితర గురువులను పూజించి వారి ఆశీర్వాదం పొందారు. కార్యక్రమంలో దెందులూరు నియోజకవర్గ కన్వీనర్ గుమ్మడి చైతన్య, పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

సహకార పాలకులు వీరే

దెందులూరు: కోపరేటివ్ సొసైటీలకు పాలకులను ప్రభుత్వం నియమించింది. దెందులూరు కోపరేటివ్ సొసైటీకి ప్రెసిడెంట్‌గా గారపాటి కొండయ్య చౌదరి, కొవ్వలి కో-ఆపరేటివ్ సొసైటీకి ప్రెసిడెంట్‌గా వెలమాటి అనిల్ నియమితులయ్యారు. సీతంపేటకు యాలమర్తి శ్రీనివాసరావు, గాలాయగూడేనికి పూజారి వెంకటరత్నం నాయుడు, పోతునూరుకు బొడ్డేటి మోహన్ నియమితులయ్యారు.

ఏఎంసీ చైర్మన్‌గా శేషగిరి

భీమడోలు: వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గాన్ని నియమిస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. భీమడోలు ఏఎంసీ గౌరవ అధ్యక్షుడిగా ఉంగుటూరు ఎమ్మెల్యే ధర్మరాజు, ఏఎంసీ చైర్మన్‌గా శేషపు శేషగిరి, వైస్ చైర్మన్‌గా నిమ్మకాయల గణపతిని నియమించారు. సభ్యులుగా అడబాల శ్రీనివాసరావు, బాతుల లక్ష్మి, బిర్లంగి యశోధరణి, చిట్టూరి పార్వతి, ఉమామహేశ్వరి తదితరులను నియమించారు.

అభివృద్ధికి అధిక ప్రాధాన్యం

ఉంగుటూరు: అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇచ్చే దిశగా ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. గురువారం చిన్న వెల్లమిల్లి ,పెద్ద వెల్లమిల్లి, బాదంపూడి, ఉప్పాకపాడు గ్రామాల్లో పల్లెపల్లెకు పత్సమట్ల కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ పూర్ణచంద్ర ప్రసాద్, ఎంపీడీవో రాజ్‌మనోజ్, ఆప్కాబ్ చైర్మన్ గన్ని ఆంజనేయులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు చేయూత

జంగారెడ్డిగూడెం: స్థానిక డాంగేనగర్ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో వృద్ధులు, వికలాంగులకు వీల్‌చైర్, వాకింగ్ స్టాండ్, చేతి కర్రలను అందించారు. ఈ సందర్భంగా సంఘ వ్యవస్థాపకులు అమృతల రంగా మాట్లాడుతూ ఎన్టీఆర్ నగర్‌కు చెందిన గడ్డం రాంబాబు జ్ఞాపకార్థం అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో బాలాజీ నగర్ నివాసి శ్రీనివాసరావుకు వాకింగ్ స్టాండ్, ఎల్-4 కాలనీ నివాసి మల్లికార్జునరావుకు వీల్ చైర్, చేతికర్రలను అందించామన్నారు. గెడ్డం రాంబాబుకు మృతి చెందడంతో గతంలో రోటరీ క్లబ్ ద్వారా ఆయనకు అందించిన వీల్‌చైర్‌ను మరో వికలాంగ యువకుడు మల్లికార్జునకు అందించినట్టు చెప్పారు. సహకారం అందిస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘ గౌరవ అధ్యక్షులు నేలపోలు ప్రభాకర్‌రావు, అధ్యక్ష కార్యదర్శులు కె.లక్ష్మణరావు, పఠాన్ బాజీ, ఉపాధ్యక్షులు ఎల్ శ్రీనివాస్, లబ్ధిదారులు పాల్గొన్నారు.